పెద్దపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మోతపై ఆగ్రహం

- ట్రూ అప్, సర్దుబాటు చార్జీలపై ఆగ్రహం
- ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత
- బాదుడును ఉపసంహరించుకోవాలని డిమాండ్



గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జి, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరువ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారంసైతం జనాలపై పడనుంది. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది. ఈ విద్యుత్ ఛార్జీల బాదుడుపై ప్రతిపక్షాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ట్రూఅప్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు..

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

వాస్తవంగా చలికాలం కరెంటు వినియోగం తక్కువగా ఉంది కాబట్టి బిల్లు తక్కువగా రావాలి. కానీ ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల బిల్లులు పెరిగిపోతున్నాయి. వైసిపి, టిడిపి రెండూ కలిపి ప్రజల మీద భారాలు వేస్తున్నాయి. 2022 – 23 సంవత్సరానికి వాడిన కరెంటు బిల్లులు ఇప్పుడు చెల్లించాల్సిన పరిస్థితి వస్తున్నవి. ఈ రోజు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విద్యుత్తు కొనుగోలు విషయంలో భారీ కుంభకోణం జరిగిందని, దీంట్లో జగన్ ఉన్నాడని చర్చ జరుగుతూ ఉంటే అధికారంలో ఉండే తెలుగుదేశం పార్టీ దీన్ని మాత్రం పక్కన పెట్టేస్తున్నది. అంటే జగన్ అయినా చంద్రబాబు నాయుడు అయినా ఇద్దరూ మిత్రులే. నష్టపోతున్నది ప్రజలు మాత్రమే. ఆ రోజు జగన్ చేసిన పాపం వల్ల 2022 23 సంవత్సరానికి 11 వేల కోట్ల రూపాయలు ప్రజలు మీద భారం పడితే ఈ రోజు చంద్రబాబు నాయుడు చేసిన తప్పిదం వల్ల మరొక 6700 కోట్లు ప్రజలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తున్నది. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది.

- ఎమ్‌డి.అంజిబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.

వెంటనే ఉపసంహరించుకోవాలి

ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. చెప్పిన హామీలను విస్మరించి ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచారు. ఇప్పటికే ట్రూ అప్ పేరుతో అదనపు భారం పడుతుండగా జనవరి నుంచి సర్దుబాటు ఛార్జీల పేరుతో మరింత బాదుడు వేయనున్నారు. ఇది చాలా దుర్మార్గం. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు వసూలు చేయడం సరైన పద్ధతి కాదు. పలు పేర్లతో వినియోగదారులపై వేస్తున్న భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలి.

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

ప్రజలపై భారాలు దుర్మార్గం

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచము అని ప్రతి సభలో వాగ్దానం చేసి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక మాట తప్పాడు. ఆరు నెలల్లో రూ.15 వేల కోట్ల విద్యుత్తు భారాలను ప్రజలపై వేయడం దుర్మార్గం. అలా వసూలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా పెంచడం చాలా దారుణం. దీనిపై భవిష్యత్తులో వైసిపి ఆధ్వర్యంలో ప్రజల పక్షన పోరాటం చేస్తాం.

- ఎస్‌వి మోహన్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు.

విద్యుత్ చార్జీల ధరలను తగ్గించాలి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల ధరలను వెంటనే తగ్గించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలను మోపమని ప్రకటించి ఇప్పుడు పెంచడం సరైంది కాదు.

- మురళీకృష్ణ, డిసిసి అధ్యక్షులు

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు గ్రామ సభ లో కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 472 గ్రామాలు ఉన్నాయని అందులో 250 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే పనులు చేయాల్సి ఉందన్నారు. రీ సర్వే జరిగిన, జరగని అన్ని గ్రామాల్లో కూడా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో చాలా వరకు భూ సమస్యలు ఉన్నాయని, మ్యుటేషన్ , వారసత్వంగా వచ్చే కుటుంబ సభ్యుల ఆస్తిభాగాల పరిష్కారం, సర్వే, పాస్ బుక్కులు రాకపోవడం, , సరిహద్దు తగాదాలు ఇలా చాలా రకాల సమస్యలు అర్జీల రూపంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వస్తూ ఉంటాయన్నారు. అన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈనెల6 నుండి జనవరి 8వరకు జిల్లా వ్యాప్తంగా 33 రోజులు పాటు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఎలాంటి భూ సమస్యలు ఉన్నా దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పాస్ బుక్ మ్యుటేషన్, సర్వే, లాంటి సమస్యలు ఏమున్నా యూజర్ ఛార్జ్ ఫీజు లేకుండా ఆన్లైన్‌లో పేరు నమోదు చేసి పరిష్కారం చూపుతామన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, దేవాదాయ, సచివాలయం, వక్ఫ్‌కి సంబంధించిన అధికారులు అందరూ ఇక్కడే ఉన్నారన్నారు. ప్రొసీజర్ ప్రకారం చేయాల్సినవి ఏవైనా ఉంటే గ్రామ సభలు పూర్తయిన 45 రోజుల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైసంతకం చేశారన్నారు. భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉండడం కోసం ముఖ్యమంత్రి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కూడా తీసుకు వచ్చారన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో చాలా ఖరీదైన వక్ఫ్ బోర్డు ఆస్తులు, దేవాదాయ ఆస్తులు అన్నీ కూడా ఆక్రమణలకు గురయ్యాయని, వాటిపైన దృష్టి సారించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జెసి డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి రసీదు ఇస్తామన్నారు. వచ్చిన ప్రతి విజ్ఞప్తిని పరిష్కరిస్తామన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా దరఖాస్తు ఏ దశలో ట్రాక్ చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూవివాదాలను పరిష్కారం కోసం కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే వారమని ,రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలవద్దకే వచ్చి పరిష్కారం చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ స్థానిక సమస్యలను వివరించారు. ముందుగా రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ దీప్తి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, 36వ వార్డు ఇంచార్జ్ రెడ్డిగారి తిరుమలేశ్వర్ రెడ్డి గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

వడ్లోని వంకను ఆక్రమించిన వారిని శిక్షించాలి

పెద్దపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌కు సిపిఎం వినతి

కల్లూరు మండలం పెద్దపాడులో వడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని వంకన్నీళ్లు యధావిధిగా పోయేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని రెవెన్యూ సదస్సులో పాణ్య ఎమ్మెల్యే గౌరు చరితకు, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషకు , జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్వకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పెద్దపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్, జెసి, ఎమ్మెల్యే , ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ మండల కార్యదర్శి కె.మధు, పెద్దపాడు శాఖ కార్యదర్శి గోపి నాయకుడు, యేసు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ పెద్దపాడు సర్వేనంబర్ 128 లోని వడ్లోని వంకను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి వంకని పూడ్చడం వలన వంకల్లోకి వెల్లె నీళ్ల గ్రామంలోకి వచ్చి దళితవాడ, హాస్టల్‌లోకి ప్రవేశించి పెద్దపాడు గ్రామ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళితవాడలోకి హాస్టల్లోకి నీరు రావడం వలన విషపురుగులు స్వైర విహారం చేస్తూ ప్రజలను విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయని చెప్పారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని, ఆక్రమించుకున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు గోపి, యేసు రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు జి.రామకృష్ణ, తదితరులు

అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు

- అంబేద్కర్ వర్ధంతి సభలో కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించడయే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని కలెక్టర్ పి.రంజిత్ బాష అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు విద్యాసంస్థల్లో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అట్టడుగున ఉన్న అన్ని వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందేలా చూస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. **జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో:** జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు పి.మురళీకష్ణ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జిలాని బాష, నాయకులు రాధాకృష్ణ, వెంకట్‌రెడ్డి డ్డి బతుకన్న, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. **టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో:** కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు బాలగంగాధర్, బాల నారా యణ, రాజు నాయక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **ఉర్దూ వర్సిటీలో:** డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో అంబేద్కర్ చిత్రపటానికి ఇంచార్జ్ విసి షావలి రిజిస్ట్రార్ లోకనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. **వొకేషనల్ జూనియర్ కళాశాలలో :** నగరంలోని బి- క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వృత్తి విద్యా అధికారి వై. పరమేశ్వర రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, విజయశేఖర్, జబీన్ అక్తర్, గిరిజారాణి, లక్ష్మి, ఉల్గోజి రావు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. **రాయలసీమ వర్సిటీలో:** రాయలసీమ విశ్వవిద్యాలయంలో వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఎన్‌టికె. నాయక్ లైబ్రరీ భవనం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సివి. కృష్ణారెడ్డి, ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ ఎన్.నరసింహులు, వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ ఆచార్య పివి. సుందరానంద్, రీసెర్చ్ డైరెక్టర్ సి. విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

రాయలసీమ వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ ఎన్‌టికె.నాయక్

నేడు మెగా పేరెంట్స్,టీచర్స్ డే

-2.80 లక్షల విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు

-రూ.47 లక్షల నిధులు విడుదల

-పాఠశాలల్లో పండుగ వాతావరణం-డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ డే నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేసింది. ఈ సమావేశంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తారు. ఈ సమావేశానికి పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులను కూడా ఆహ్వానించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ డే నిర్వహణకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ సమావేశాల నిర్వహణకు దాదాపుగా రూ.47 లక్షల నిధులను జిల్లా విద్యాశాఖ పాఠశాలలకు విడుదల చేసింది. పాఠశాలల్లోని 2.80 లక్షల మంది విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తారు. ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్స్ టీచర్స్ డే సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలు ఆటలు సాంస్కృతిక పోటీలను నిర్వహించిన వారికి బహుమతులను అందజేయనున్నారు. విద్యార్థులకు అందజేసిన ట్యాబ్ల వినియోగం సంబంధించి కూడా అవగాహన కల్పిస్తారు. ఈ సమావేశానికి హాజరుకావాలని ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు , పూర్వ విద్యార్థులకు ఎస్ఎంఎస్ ల ద్వారా ఆహ్వానం పంపారు. పాఠశాల ప్రాంగణాన్ని తోరణాలతో అలంకరించి పండుగ వాతావరణం కల్పిస్తున్నారు.

విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ రిపోర్టులు

డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ రిపోర్టు మెగా పేరెంట్స్ టీచర్స్ డే సమావేశంలో అందజేస్తాం. పాఠశాలలో ఓ పండుగ వాతావరణం కల్పించే విధంగా పేరెంట్స్ టీచర్ డే సమావేశం నిర్వహిస్తున్నాం. విద్యార్థులు తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులందరూ ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలి.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం సూదేపల్లి గ్రామంలో రెవిన్యూ సదస్సులో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారా ఆయా గ్రామాలలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన సొంత గ్రామమైన క్రిష్ణగిరి మండలం కంబాలపాడులో కూడా యథేచ్ఛగా భూములను ఆక్రమించారన్నారు. భూ కబ్జాలు, భూ తగాదాలు, రిసర్వే సమస్యలు, పొలం సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. సూదే పల్లె చెరువుకు నీళ్లు తీసుకొస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని, చెరువుకు నీరు నింపి మాట నిలబెట్టుకున్నామన్నారు. అనంతరం సూదే పల్లి చెరువును పరిశీలించారు. సుబ్బారాయుడు, జ్ఞానేశ్వర్ గౌడ్, రమాకాంత్ రెడ్డి, జయరాముడు, రామలకోట ఆచారి, కలగొట్ల రామకష్ణ, మండల ప్రత్యేక అధికారి తులసి దేవి, తహశీల్దార్ చంద్రశేఖర వర్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

300 ఎకరాల్లో ఓర్వకల్లులో డ్రోన్ హబ్ - మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతుల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు..శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషతో కలిసి ఆర్ అండ్ బి నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులను కూడా పరిశీలన చేశారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూనంద్యాల చెక్ పోస్టునుంచి గార్గేయపురం పోయే రహదారి అనేక ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. ముఖ్యంగా ఇక్కడ 100 అడుగుల రోడ్డు నిర్మించాలా? లేదంటే 120 అడుగులకు నిర్మించాలా అనే విషయంలో నేషనల్ హైవే, కార్పొరేషన్ మధ్య ఒక సందిగ్ధత నెలకొందని, దీంతో చాలా కాలంగా ఆ రోడ్డు ఆగిపోయిందన్నారు. 100 అడుగుల వరకు రోడ్డును నేషనల్ హైవే తీసుకుని, మిగిలినది కార్పొరేషన్‌కు అప్పగించాలని ఈ సమావేశంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు మంత్రి తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు, అక్కడ భవనాల నష్టపరిహారంకు ఎంత ఖర్చు అవుతుందనే దానిపై డిపిఆర్ తయారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. నేషనల్ హైవే, ఆర్ అండ్‌బి నుంచి ఎలా సహకారం అందించగలమో పరిశీలిస్తామన్నారు. ఈ నెల 15న నోటిఫికేషన్ ఇచ్చి, ఆ తర్వాత 45 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించామన్నారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు డివిజన్‌లో 42 శాతం, ఆదోని డివిజన్ లో 72 శాతం రోడ్ల మరమ్మతులు చేశామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.3 వేల కోట్లు కేంద్రం నుంచి నిధులు వచ్చాయన్నారు. రాష్ట్రంలోని తొలిసారి డ్రోన్ హబ్ గా తీర్చిదిద్దడానికి 300 ఎకరాలలో ఓర్వకల్‌కు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, పాల్గొన్నారు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి , కలెక్టర్ , ఎమ్మెల్యేలు

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

-ఎస్‌పి, హోంగార్డ్ సదరన్ రీజియన్ కమాండెంట్

-ఘనంగా 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసుల సంక్షేమమే ముఖ్యమని అందరూ బాగా పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల ఆవిర్భావం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి జి. బిందు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. బెలూన్లు, కపోతాలను ఎగురవేశారు. ఎస్‌పి మాట్లాడుతూ ....పోలీసులతో సమానంగా హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణలో మంచి సేవలు అందిస్తున్నారన్నారు. ఎమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. సమస్యలుంటే నేరుగా తనను కలిసి విన్నవించవచ్చున్నారు. హోంగార్డుల సమస్యల పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం తరపున జిల్లా ఎస్‌పిగా తన వంతుగా కృషి చేస్తానన్నారు. క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా సమిష్టిగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. హోంగార్డ్ సదరన్ రీజియన్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ మాట్లాడుతూ హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలలో కూడా హోంగార్డులు మంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధులలో సహజ మరణం లేదా రోడ్డు ప్రమాదంలో మరణిస్తే రూ. 5 లక్షలు జీవితబీమా వచ్చే విధంగా ప్రభుత్వం వెసలు బాటు కల్పించిందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బి.టెక్ లలో మంచి మార్కులు సాధించిన ఆరుగురు హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేశారు. లాంగ్ జంప్, షాట్‌పుట్, 100 మీటర్ల క్రీడా పోటీలలో గెలుపొందిన హోంగార్డు విజేతలకు జిల్లా ఎస్‌పి బహుమతులు ప్రదానం చేశారు. వివిధ కేసులలో , బందోబస్తు విధులలో ప్రతిభ కనబరచిన 33 మంది హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆదోని యూనిట్‌కు చెందిన హోంగార్డు రాఘవులు, పత్తికొండ యూనిట్‌కు చెందిన టి. కృష్ణ, కర్నూలు యూనిట్ కు చెందిన విజయ కుమారిలు పదవీ విరమణ పొందారు. జిల్లా ఎస్‌పి వారిని శాలువ, పూల మాలతో సన్మానించారు. విధుల్లో చైతన్యపరిచే పాటలు పాడి హోంగార్డు ఆర్. శ్యాముల్ అందరిని అలరించారు. హోంగార్డు సిబ్బందికి , కుటుంబ సభ్యులకు ఎస్‌పి భోజనం వడ్డించారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్‌పీరా , ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ , ఎఆర్ డిఎస్‌పి భాస్కరరావు, హోంగార్డ్ డిఎస్‌పి ప్రసాద్ , పోలీసు వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి , స్పెషల్ బ్రాంచి సిఐ కేశవరెడ్డి, ఆర్ఐలు జావేద్, నారాయణ , సోమశేఖర్, ఆర్ ఎస్ఐలు , పోలీస్, హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా హోంగార్డును అభినందిస్తున్న ఎస్‌పి, కమాండెంట్

టిడ్కోలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టిడ్కో భవన సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు.శుక్రవారం టిడ్కో భవన సముదాయంలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడ్కో ఇళ్లు కేటాయించలేదని, మౌలిక వసతులు కల్పించాలని, పలువురు అర్జీలు ఇస్తున్నారన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడే రేషన్ అందజేయడానికి వీలుగా కొత్త రేషన్‌షాపు ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 37వ వార్డు సోమిశెట్టి ఎస్టేట్లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని, మురుగు కాలువలు శుభ్రం వేయాలని కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ ఎస్ఇ రాజశేఖర్ కు వినతి పత్రం ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ ఎన్.అలివేలు. సోమిశెట్టి ఎస్టేట్ కాల్ నివాసులు పాల్గొన్నారు.

ఎస్ఇకి వినతిపత్రం ఇస్తున్న పద్మ, అలివేలు

అన్నంలో అగ్గిపుల్లను చూపుతున్న విద్యార్థులు

అన్నంలో అగ్గిపుల్లలు

అంబేద్కర్ ఆశయ సాధన సమితి పరిశీలన

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్‌లోని బిసి హాస్టల్‌లో వడ్డించిన అన్నంలో అగ్గి పుల్లలు వెలుగుచూశాయి. దీంతో అక్కడి విద్యార్థులు అవాక్కయ్యారు. ఇదే హాస్టల్‌లో తరచూ వంటకాల్లో అగ్గి పుల్లలు, తుంట బీడీలు, పేపర్ ముక్కలు, వంటివి కనిపిస్తాయని విద్యార్థులు పలువురు వాపోయారు. ఇది తెలిసి అంబేద్కర్ ఆశయసాధన సమితిమండల అధ్యక్షులు, గౌరవఅధ్యక్షులు పోలసి వెంకటేష్‌లు వెళ్లి వంట గదిలో వంటసామాగ్రిని పరిశీలించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ లక్ష్మీ నారాయణ

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్ర ప్రజలపై ట్రూ అప్ చార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఆలూరు ఇన్‌ఛార్జీ చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, డిప్యూటీ తహశీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో సామాన్యునిపై భారం మోపడం దారుణమని మండిపడ్డారు. ఎన్నికల హామీల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసిన కూటమి గద్దెనెక్కాక మాట నిలబట్టుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు లింగంపల్లి రామాంజనేయులు, హత్తిబెళగల్ ఖాదర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు గూళ్యం ఎల్లప్ప, బాపురం మోషే, మొలగవెల్లి పూల రామాంజనేయులు, చిప్పగిరి మండల మాజీ అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు, వరకుమార్, తిమ్మప్ప, వెంకటేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

కార్యకర్తకు జనసేన ఆర్థిక చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

కొంతకాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న జనసేన కార్యకర్త హనుమంతు కుటుంబానికి ఎపి కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, జనసేన మండల కన్వీనర్ అరవింద్ కుమార్ రూ.25,600 ఆర్థిక చేయూత అందజేశారు. శుక్రవారం జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప ఆదేశాల మేరకు మండలంలోని హాలిగేర గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త హనుమంతుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హనుమంతు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జనసేన మండల నాయకులు శివ, సోమశేఖర్, శ్రీను, రంజిత్, మహదేవ్, అనుమేష్, వీరేష్, విష్ణు, అనిల్, అంజి, సురేష్, ప్రసాద్, వినోద్, ప్రకాష్, రంగ పాల్గొన్నారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి రహదారుల వెంట నడుస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన చిప్పగిరిలో చోటు చేసుకుంది. మృతుడు కుమ్మరి శంకరయ్య (65) భార్య, గ్రామస్తుల వివరాల మేరకు... శంకరయ్య మతిస్థిమితం కోల్పోయి రోజూ రహదారులు వెంట తిరుగుతూ ఉండేవారు. శంకరయ్య శుక్రవారం గ్రామ సచివాలయం వెనుక ఉన్న బావిలో పడి మృతి చెందారు. మృతుడు కుమ్మరి శంకరయ్యకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

జాబ్ మేళాలో 23 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో నవభారత్ ఫర్టిలైజర్స్, అమర్ రాజా గ్రూప్స్ ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 48మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. 23 మంది ఉద్యోగాలకు ఎంపికయినట్లు ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ... వెనుకబడిన నియోజకవర్గంలో చదువుకున్న యువత వ్యాసనాలకు తావివ్వకుండా ప్రభుత్వం చేపడుతున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, కృష్ణ పాల్గొన్నారు.

ఎంపికైన నిరుద్యోగులతో అధికారులు

నాణ్యత ప్రమాణాలు ముఖ్యం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీలో పేదల కోసం ప్రభుత్వం నిర్మించే గృహాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మండగిరి హౌసింగ్ లేఅవుట్ గృహ ఇంటి నిర్మాణాల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుకున్న లక్ష్యం మేరకు నిర్మాణాల వేగం పెంచాలని తెలిపారు. ఇప్పటికే పూర్తయిన గృహాల బిల్లులు త్వరగా మంజూరు చేయాలన్నారు. పనులు త్వరగా జరిగేలా లేబర్‌ను పెంచాలని తెలిపారు. ఈనెల చివరిలోపు ఆదోని అర్బన్‌లో 800 గృహాలు లబ్ధిదారులకు అప్పగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇసుక, సిమెంటు, ఇనుము కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు పటిష్టంగా ఉండేలా క్యూరింగ్ పెంచాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కనబడుతోందని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఇంటి నిర్మాణాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ మూర్తి ఉన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

- నిందితుని ఇంటికి నిప్పు
- చెల్లెల చెలిమలలో ఉద్రిక్తత
- పరస్పర ఫిర్యాదులతో ఇరువర్గాలపై కేసు నమోదు
- గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ వెంకటరామయ్య

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని చెల్లెల చెలిమల గ్రామంలో మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. కోపోద్రిక్తులైన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నిందితుని ఇంటికి నిప్పు పెట్టారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పోలీసుల మోహరింపుతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలో బీసీ వర్గానికి చెందిన మైనర్ బాలిక పాల ప్యాకెట్ కోసం దుకాణానికి వెళ్లింది. అక్కడే ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువకుడు చెయ్యి పట్టుకోవడంతో బాలిక కేకలు వేసింది. గ్రామస్తులు ఆ యువకుని పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఒక్కసారిగా గ్రామస్తులు నిందితుని ఇంటికి నిప్పు పెట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక సిఐ వంశీనాథ్ పోలీసు సిబ్బందితో గ్రామానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. శుక్రవారం డీఎస్పీ వెంకటరామయ్య గ్రామాన్ని సందర్శించి సంఘటన వివరాలు తెలుసుకొని రెండు వర్గాలు, కుటుంబ కుటుంబ సభ్యులపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ

ఉపాధ్యాయురాలి మృతి

- పోలీసుల అదుపులో ప్రధానోపాధ్యాయులు..?

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదోని పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని పూల బజార్‌లో నివాసముండే ఉపాధ్యాయురాలు భారతి ఇంట్లోనే ఉరేసుకుని గురువారం సాయంత్రం మృతి చెందారు. ప్రస్తుతం ఆమె ఆలూరు పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారతి భర్త శివ ప్రకాష్ ఫైనాన్స్ బిజినెస్ నిర్వహిస్తున్నారని, వారికి ఇద్దరు సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భారతి మృతదేహానికి శుక్రవారం ఆదోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆదోని వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారతిది అనుమానాస్పద మృతి

- మృతురాలి తండ్రి బసవరాజు

మా కుమార్తె ఆత్మహత్య చేసుకునే పిరికిది కాదు. ఆరోగ్యం బాగానే ఉంది. ఒక వ్యక్తి వేధింపుల వల్ల మృతి చెంది ఉండవచ్చని విచారించి బాధ్యులను శిక్షించాలని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో ప్రధానోపాధ్యాయులు..?

ఆదోని మండలంలోని ప్రభుత్వ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గతంలో పలుమార్లు వేధించారని ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో విచారించి తదుపరి వివరాలు వెల్లడిస్తామని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న ఉద్యోగులు

ఎన్నాళ్లీ..! వెట్టిచాకిరి

- పనికి తగిన వేతనం ఎప్పుడు..?
- డిమాండ్ల సాధనకు కదం తొక్కిన మున్సిపల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

చాలీచాలని వేతనాలతో దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించకుండా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వెళ్లగక్కారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా చేరుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు ఈరన్న, సిఐటియు మండల అధ్యక్షులు తిప్పన మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పేరుతో ఇంజినీరింగ్, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సెక్షన్లలో చాలీచాలని వేతనాలతో దశాబ్ద కాలంగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతమిచ్చే జీతం ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులకు సరిపోక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిందన్నారు. బియ్యం కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక అరకొర వేతనంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరినీ రెగ్యులర్ చేయాలని పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. కాలయాపన చేస్తున్నారే తప్ప వారిని రెగ్యులర్ చేయడం లేదని తెలిపారు. విధుల్లో చనిపోయిన ఉద్యోగ, కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.15 లక్షలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అధికారి బాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగ అసోసియేషన్ నాయకులు పీరా, అహ్మద్, వీరేష్, కృష్ణమూర్తి, బాష, కర్రెప్ప, కంప్యూటర్ సెక్షన్ శివ, వాటర్ సెక్షన్ రామాంజనేయులు, కైలాష్ ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి
- రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శుక్రవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ భరద్వాజ్, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూముల కొలతల్లో తేడా వచ్చినా, భూములను ఎవరైనా కబ్జా చేసినా, అడంగల్, ఆర్ఒఆర్, ఏ రికార్డుకు సంబంధించిన తేడాలున్నా రెవెన్యూ సదస్సు ద్వారా అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో రికార్డులను తారుమారు చేసి రైతులను ఇబ్బందులు గురిచేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ సదస్సుల ద్వారా సరి చేస్తున్నామని చెప్పారు. మండల నోడల్ ఆఫీసర్ నాగరాజ్, తహశీల్దార్ శివ రాముడు, సర్పంచి ప్రహ్లాద్ యాదవ్, జడ్‌పిటిసి అరుణమ్మ, ఆర్ఐ పెద్దయ్య పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలం పెద్దనేలటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, జెడిఎ పిఎల్.వరలక్ష్మి, తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి రోజు రెవెన్యూ సదస్సులు ప్రారంభించామని తెలిపారు. సర్పంచి సోమన్న, ఎఒ హేమలత పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని రామదుర్గం గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు పొలాలపై ఎప్పటి నుంచో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. సదస్సులో పొలం కొలతలు ఇవ్వాలని ఒక రైతు దరఖాస్తు ఇవ్వగా.. మరో ఇద్దరు రైతులు పొలం పాసు పుస్తకాల కోసం దరఖాస్తులను ఇచ్చారని అధికారులు తెలిపారు. సర్పంచి భర్త వీరప్ప, ఆర్ఐ సునీత, మండల సర్వేయర్ నారాయణ, విఆర్ఒలు గోవిందప్ప, వన్నూరు స్వామి, అంజి, విలేజ్ సర్వేయర్లు వినోద్ కుమార్, గోవర్ధన, రైతులు పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం చెట్నిహళ్లి గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా అటవీ శాఖాధికారి శ్యామల, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ ఎస్.రవి మాట్లాడుతూ... మండలంలోని గ్రామాల్లో భూములు, హద్దులు, విభాగాలు, మిగులు భూములు, ఆన్‌లైన్ సమస్యల పరిష్కార వేదికగా ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, విఆర్ఒ భీమయ్య, టిడిపి నాయకులు చేపల నాగేష్, సర్పంచి అంజినయ్య పాల్గొన్నారు. **హోళగుంద** మండలం చిన్నహేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్, మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్ఒ ప్రహ్లాద పాల్గొన్నారు.

వైసిపి తప్పిదం వల్లే భూతగాదాలు

- ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు : గత వైసిపి ప్రభుత్వ తప్పిదం వల్లే భూతగాదాలు నెలకొన్నాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. మండలంలోని గుడికల్లు గ్రామంలో తహశీల్దార్ శేషఫణి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి హాజరయి మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న బీవీ

రామదుర్గం(చిప్పగిరి)లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

ఆదోనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

గోనెగండ్లలో

హోళగుందలో...

మంత్రాలయంలో...

బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని నారాయణపురం గ్రామంలో సర్పంచి అల్లమ్మ గారి సరళమ్మ, వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని సైడు కాలువల్లో మురుగు పేరుకుపోయి నీటిపారుదల ఆగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ పాలకవర్గం ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది సైడు కాలువల్లోని మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పారిశుధ్య సమస్యలు, ఇబ్బందులు తలెత్తడంతో ఆ చెత్తను అక్కడి నుంచి తొలగించారు. అనంతరం గ్రామంలో దోమలు విజృంభించకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి రామమూర్తి పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి - హొలహర్వి

మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. తల్లిదండ్రుల సమావేశాలను పండగ వాతావరణంలో నిర్వహించడానికి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానికి హాజరు కావాలని కోరుతూ విద్యార్థుల చేత ఆహ్వాన పత్రికలు తయారు చేయించి ఇళ్లకు అందజేశారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదికలను తెలియపరచడానికి వీలుగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ప్రత్యేక ఆహార పదార్థాలతో శుభ్ దిన్ భోజనం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ ఈరన్న శుక్రవారం తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం పేర్కొన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కెవిపిఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు చిన్నప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంథోని, సుమాల రాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్, నాయకులు నాగరాజు, తిక్కయ్య పాల్గొన్నారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, జిల్లా నాయకులు గోవిందు, హనుమంతు, డివైఎఫ్ఐ నాయకులు సురేష్‌కుమార్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ధామ నరసింహులు, నాయకంటి, అంబేద్కర్, ఫరూక్, పందికోన ఈరన్న, కదిరికోట షాలేము, శివ, సూర్యనారాయణ, సురేంద్ర, రంగస్వామి గౌడ్, సుందర్ రాజు, సందీప్, మిన్నప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం :** కుల వివక్షపై పోరాటాలకు ప్రజా సంఘాలు కలిసి రావాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు కోరారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి జి.అంజి అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ నాయకులు జి.సురేష్, మండల నాయకులు ఆంధ్రయ, ప్రాణేష్, లక్ష్మన్న, మాధవరం నాయకులు నడిపి తిక్కన్న, హనుమంతు, నాగరాజు పాల్గొన్నారు. అలాగే జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఏబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనిల్, జక్కయ్య, మారెప్ప, రత్నం పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ ఆవరణలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ అధ్యక్షతన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు భక్తకన్నప్ప, నరసింహుడు, శంకర్, మునెప్ప, మారేష్, ఆటో యూనియన్ నాయకులు ఈశ్వర్, తేజ, విజయ్, రాఘవేంద్ర, వీరన్న గౌడ్, రహీం, బిజెపి నాయకులు మహేష్, శ్రీరామ్ పాల్గొన్నారు. **చిప్పగిరి**లోని ఆర్‌డిటి కార్యాలయంలో నెట్టికంటయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు నెట్టికంటయ్య పాల్గొన్నారు. అలాగే నేమకల్లు గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. నెట్టేకల్లు, వెల్డింగ్ లక్ష్మన్న, వీరేష్, చిన్న ఈరన్న, సుంకన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** పట్టణంలో ఉన్న అంబేద్కర్ కాంస్య విగ్రహానికి టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, వన్నెల మోష, జగతాప్ జైపాల్, ఎస్.సాల్మన్, జాలవాడి ఏసన్న, దళిత సంఘం నాయకులు గుడికల్ స్వామిదాస్, ఇసాక్ పాల్గొన్నారు. **కౌతాళం**లో దళిత సమాఖ్య, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. దళిత సమాఖ్య మండల కమిటీ నాయకులు విజయ మోహన్ కుమార్, కౌతాళం సర్పంచి పాల్ దినకర్, ముకేష్, ప్రకాష్, నాగరాజు, అబ్రహాం, మారెప్ప, ఉలిగప్ప, భీమా, బసవ, దేవేంద్రప్ప పాల్గొన్నారు. అలాగే ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు ఆనంద్, నాయకులు బసవ రేవన పాల్గొన్నారు. **హోళగుంద**లోని ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య జిల్లా కన్వీనర్ చిన్నహేట నాగరాజు, నాయకులు హెచ్.చలపతి, హెచ్.మంగన్న, మల్లప్ప, వీరేష్, సోమప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు


మంత్రాలయంలో


గోనెగండ్లలో


కౌతాళంలో

పాఠశాలకు కంప్యూటర్ విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం జిల్లా పరిషత్ పాఠశాలకు కంప్యూటర్ విరాళం ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థి (ఆంధ్రజ్యోతి మాజీ పాత్రికేయులు) కె.లక్ష్మణాచారి కంప్యూటర్‌ను విరాళంగా అందజేశారని తెలిపారు. పాఠశాలకు, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ కంప్యూటర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దాతను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్, సుబ్రహ్మణ్య శర్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

కంప్యూటర్ అందిస్తున్న దాతలు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- డాక్టర్ గోవిందమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో 104 సేవల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, షుగర్, బీపీ కలిగిన 35 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసి తగిన సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. పిహెచ్ఒ జయంతి, ఎఎన్ఎంలు సుజాత, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ ప్రమీల, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హోసళ్లిలో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

మండలంలో జి.హోసళ్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వం నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు, యువకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సౌదీరావుఫ్, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, మల్లేశ్వరప్ప, మద్దికేరి రామకృష్ణ, ఎమ్‌డి.హుస్సేన్, నారాయణపురం షాషావలీ, శ్రీనివాసులు, బీటీ.శీన, హోసళ్లి రఘునాథ్ రెడ్డి, మదిరే మాజీ సర్పంచి గోవిందు, సలకలకొండ శీన, బద్రి, రమేష్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేస్తున్న భాస్కర్ రెడ్డి

SRI RAGHAVENDRA B.Ed. COLLEGE
Plot No.1336. Maruthi Estate - 2, Near Nannuru Toll Plaza,
NANNURU - 518002. Orvakal Mandal, Kurnool Dt.
SPOT & MANAGEMENT
SEATS ARE AVAILABLE - 2024-2026
Two years B.Ed. Course in All Subjects Spot & Management Seats are Available **(2024-2026)**
Eligibility : Any Degree (B.A/B.Sc./B.Com./B.B.M/B.E/B.Tech) O.C.-50%, B.C, S.C & S.T - 40 % of Qualifying Examination.
Last date (to receive applications) 13-12-2024
with EDCET (or) Without EDCET.
Cell: 94407 56127
CORRESPONDENT

SRI RAGHAVENDRA COLLEGE OF EDUCATION
Plot No.1336. Maruthi Estate - 2, Near Nannuru Toll Plaza,
NANNURU - 518002. Orvakal Mandal, Kurnool Dt.
SPOT & MANAGEMENT
SEATS ARE AVAILABLE - 2024-2026
Two years B.Ed. Course in All Subjects Spot & Management Seats are Available **(2024-2026)**
Eligibility : Any Degree (B.A/B.Sc./B.Com./B.B.M/B.E/B.Tech) O.C.-50%, B.C, S.C & S.T - 40 % of Qualifying Examination.
Last date (to receive applications) 13-12-2024
with EDCET (or) Without EDCET.
Cell: 94407 56127
CORRESPONDENT